క్లుప్తంగా

పౌరహక్కులపై అవగాహన అవసరం

నవాబుపేట: పౌరుల హక్కులపై అవగాహన అవసరమని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఎస్‌ఐ పురుషోత్తం అన్నారు. గురువారం మండలంలోని కాకర్‌జాల్‌లో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. వారు మాట్లాడుతూ పౌరులు హక్కులను తెలుసుకుని నడుచుకోవాలని, వాటిని దుర్వినియోగం చేసేలా ఉండరాదన్నారు. సమాజంలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని, దాంతోనే అన్ని ముడిపడి ఉన్నాయన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మహమ్మదాబాద్: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన జూలపల్లిలో చోటు చేసుకుంది. గ్రామాన్ని చెందిన పోన్సని శంకరయ్య గేదెలను పెంచుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం గేదెలను మేపి కొట్టంలో కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి తాడు తెంచుకుని గేదె మోటార్ స్టార్టర్ వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగకు తగిలి మృత్యువాత పడింది. గేదె విలువ రూ.80వేలు ఉంటుందని, తనకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించాలని కోరారు.

బూరెడ్డిపల్లికుంటలో చేపలు మృత్యువాత



జడ్చర్ల: మండలంలోని బూరెడ్డిపల్లి శివారులో గల మురుగువాని కుంటలో గురువారం చేపలు చనిపోయి ఒడ్డుకు చేరాయి. ఎగువ భాగానా మల్లె బోయిన్‌పల్లి శివారులో గల మిషన్‌భగీరథ తాగు నీటి ట్యాంకు నుంచి ఓవర్ ఫ్లో అయిన నీరు సమీప వెంచర్ గుండా కుంటలోకి చేరడంతో చేపలు చనిపోయాయని మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. భగీరథ నీటిలో వాడిన రసాయనాల కారణంగా చేపలు చనిపోయి ఉంటాయని భావిస్తున్నట్లు తెలిపారు. చేపలను తాను సొంతంగా కొనుగోలు చేసి కుంటలో వదిలినట్లు తెలిపారు. దాదాపు రూ.40వేల మేరకు నష్టం వాటిల్లిందన్నారు.



జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి రాఖీ కడుతున్న తన సోదరి



పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



రాయపల్లిలో..

ఇంటింటా రాఖీ పండుగ సందడి



మహబూబ్‌నగర్ 9వ వార్డులో సోదరులకు రాఖీ కడుతున్న సోదరి

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను గురువారం జిల్లా వాసులు ఘనంగా చేసుకున్నారు. మెట్టినింటి నుంచి పుట్టినింటికి వచ్చిన ఆడపడుచులు తన అన్నా తమ్ముళ్లకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి ఆనందోత్సహాలను పంచుకున్నారు. జిల్లాలో ప్రతి ఇంటా ఆడపడుచుల పండడి కనిపించించగా చిన్నారులు తమ అన్నలకు రాఖీలు కట్టి మురిసిపోయారు. ఉదయం నుంచి రాఖీల విక్రయ దుకాణ సముదాయాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

– సాక్షి నెట్‌వర్క్



మిడ్జిల్‌లో..



కోయిల్‌కొండ మండలం దమాయపల్లిలో



అప్పంపల్లిలో..



నవాబుపేటలో..



మూసాపేటలో..

కుష్టు నిర్మూలనపై సర్వే

మిడ్జిల్: మండల కేంద్రంలో గురువారం జిల్లా కుష్టు నిర్మూలన అధికారి జరినా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు గ్రామంలో 65 మందిని గుర్తించామని, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మనుప్రియా, డీపీఎంఎస్ నర్సింహారెడ్డి, హన్మంత్‌రావు, శ్రీనివాసులు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



అభద్రత భావం తొలగించడానికే కార్డెన్ సర్చ్



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భూత్పూర్: ప్రజల్లో అభద్రతా భావం తొలగించడానికే కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ రామకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మున్సిపాలిటీలోని శేరిపల్లి(బి)లో ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో కలిసి ఇంటి యజమానులు, అద్దెకు ఉన్న వారి వివరాలు, వాహనాలు, వాటి పత్రాలు, ఆధార్ కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కొత్తవారు ఎవరైనా ఉన్నారా? అనే వివరాలు సేకరించినట్లు వివరించారు. 15 వాహనాలకు అనుమతిపత్రాలు లేకపోవడంతో వాటిని స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు, అనుమానితులు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వావలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసులు, మూసాపేట ఎస్‌ఐ శ్రీనివాసులు, అడ్డాకుల ఎస్‌ఐ మాధవరెడ్డి, చిన్నచింతకుంట ఆర్.శేఖర్, 10 మంది ఎస్‌ఐలు, 45 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం



అడ్డాకుల: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గురువారం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పార్టీ ఇటీవల ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పెద్దపీట వేశారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొండా జగదీశ్వర్, నాగిరెడ్డి, శ్రీహరి, శకుంతల, షఫిఅహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పరశురాములు, రాములు, బాలన్న ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మార్కండేయ జయంతి

నవాబుపేట: మండలంలోని కామారంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ దేవాలయంలో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లింగం, నర్సింహులు, శ్రీరాం నరేష్, పెంటయ్య, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంతో పాటుగా వాడ్యాల్‌లో మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. హోమాలు, వత్రాలు నిర్వహించిన అనంతరం నూతన గోయిత్రిలను జంజనం ధరించారు. కార్యక్రమంలో శేఖర్, శ్రీను, వెంకటేష్, చంద్రశేఖర్, యాదయ్య, కృష్ణ, నారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఇమ్మడి నారాయణ సేవలు స్ఫూర్తిదాయకం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఏనుగొండ సర్పంచ్‌తో పాటు పలు పదవులు చేపట్టిన ఇమ్మడి నారాయణ చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక ఏనుగొండలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఎన్పీ వెంకటేష్, వినోద్‌కుమార్, అజీజ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: ప్రభుత్వం స్పందించి గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని మండల కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం మండల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలేదీక్షలో ఆయన మాట్లాడారు. అన్ని అర్హతలు ఉన్నా గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య చేస్తుందన్నారు.



స్పందన అంతంతే..!



మహబూబ్‌నగర్‌లో కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్‌ఓలు

- ప్రత్యేక ఓటరు నమోదులో అందిన 1,445 దరఖాస్తులు
- వచ్చేనెల 2, 3వ తేదీల్లో మరోసారి

మహబూబ్‌నగర్ రూరల్: ఎన్నికల సమయం సమీపిస్తుంది. ఓటు హక్కు వినియోగించుకోవాలంటే తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదై ఉండాలి. ఇప్పటికే నమోదైనా.. జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకోవడం మంచిది. ఇందులో భాగంగానే ఎన్నికల కమిషన్స్ ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక ఓటరు నమోదును క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కేవలం దరఖాస్తుల స్వీకరణ మాత్రమే కాకుండా జాబితాలో పేర్లు పరిశీలించుకునేందుకూ అవకాశం కల్పించారు. దీనికి ప్రజల నుంచి ఆశించిన స్పందన కనిపించలేదని చెప్పాలి. మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలో రెండ్రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై కథనం


కొత్తగా 1,106 మంది

నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతుండగా, క్షేత్రస్థాయిలో ఈనెల 26, 27వ తేదీల్లో నిర్వహించారు. మొత్తం 272 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 272 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలను అందుబాటులో ఉంచారు. వీరు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండి, ప్రజలు పేర్లు పరిశీలించుకోవడంతో పాటు ఓటుహక్కు లేని వారు, చిరునామా మార్పు, తప్పిదాల సవరణకు దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. రెండు రోజుల్లో మొత్తం అన్ని రకాల దరఖాస్తులు కలిపి 1,445 వచ్చాయి. కొత్తగా ఓటరు నమోదు కోసం 1,106 మంది దరఖాస్తు చేసుకోగా, 175 మంది తప్పుల సవరణ, చిరునామా మార్పు కోసం, ఇంటి మార్పునకు 164 మంది దరఖాస్తు చేశారు. మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ నాగార్జున పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఇటీవల ముసాయిదా జాబితా ప్రకారం నియోజకవర్గంలో పురుషులు 1,17,519, మహిళలు 1,17,155, ఇతరులు 11 మొత్తం 2,34,685 మంది ఓటర్లు ఉన్నారు.

2, 3వ తేదీల్లో మరోసారి..

వచ్చేనెల 2, 3వ తేదీల్లో మరోసారి ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అర్బన్ మండల ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సునిల్‌కుమార్ చెప్పారు. సెలవు రోజుల్లో ప్రజల సౌకర్యార్థం ఓటరు జాబితాలను అందుబాటులో ఉంచడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. జాబితా పరిశీలించుకోవడం ద్వారా సమస్య ఉండదని, పొరపాటున పేర్లు లేకున్నా.. ఇప్పుడు నమోదు చేసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. ప్రత్యేక డ్రైవ్‌తో సంబంధం లేకుండా ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. అయితే ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించారు. సెప్టెంబర్ 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గడువు విధించారు. అక్టోబర్ 4న తుది జాబితా ప్రకటించనున్నారు.

అవకాశం వినియోగించుకోండి



వచ్చేనెల 2, 3 తేదీల్లోనూ అన్ని పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారు. కొత్త ఓటుకు ఫారం-6, తొలగింపునకు ఫారం-7, చిరునామా, పోలింగ్ కేంద్రం, ఇంటి పేరు మార్పునకు ఫారం-8 అందజేయాలి. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు అర్హులు.

– నాగార్జున, తహసీల్దార్, మహబూబ్‌నగర్ అర్బన్

డేంజర్ కూడలి 'పెద్దాయపల్లి'

- రోడ్డు నిర్మాణ లోపంతో తరుచూ ప్రమాదాలు
- ముఖ్య కూడలిలో ఏర్పాటు చేయని నాలుగు లేన్ల రోడ్డు
- బారికేడ్లు ఏర్పాటు చేసినా ఫలితం అంతంతే..



పెద్దాయపల్లి కూడలిలో కారును ఢీకొన్న లారీ (ఫైల్)

బాలానగర్: మండలంలోని జాతీయ రహదారి పెద్దాయపల్లి కూడలి వద్ద తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోనే తరుచూ ఎక్కువ ప్రమాదాలు అవుతున్న ప్రాంతంగా గుర్తుంపు పొందినా నేషనల్ హైవే అధికారులు, టోల్‌ప్లాజా అధికారులు మాత్రం నివారణ చర్యలు చేపట్టడం లేదని మండల వాసులు ఆరోపిస్తున్నారు. జాతీయరహదారి నుంచి పరిసర గ్రామాలకు వెళ్లే ముఖ్య కూడళ్లలో రెండు లేన్లుగా ఉన్న రహదారిని కనీసం 50 మీటర్లు మూడు లైన్లుగా, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని నాలుగు వరుసలుగా రోడ్డు నిర్మాణం చేపడతారు. కానీ పెద్దాయపల్లి గ్రామం వైపుగా నాలుగు వరుసలు రోడ్డు ఏర్పాటు చేయగా, అటు గుండేడ్, ఉడిత్యాల వైపుగా ఉన్న జాతీయరహదారి కేవలం రెండు వరుసలు వేసి వదిలేశారు. దీంతో గుండేడ్ వైపు తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

రోడ్డు నిర్మాణ లోపం..

గుండేడ్ వైపుగా జాతీయరహదారిపైకి వచ్చే భారీ వాహనాలు దాదాపు రెండు లేన్ల రోడ్డును ఆక్రమించుకుని వాహనాల రాకపోకలు సాగించడంతో అటువైపుగా వచ్చే వాహనాల అదుపు తప్పి పడిపోతున్నాయి. మండల కేంద్రం నుంచి నవాబుపేట్ మండలంతోపాటు, ఉడిత్యాల, నేరళ్లపల్లి, రాఘవాపూర్, చొక్కంపేట్, సూరారం, వీరన్నపల్లి, జాలుగడ్డ, వాయిల్ కుంట, ఊటకుంట, ఈదమ్మగడ్డ, గుండేడ్, చెన్నంగుల గడ్డ, చింతకుంటతండా పంచాయతీలతో పాటు పదుల సంఖ్యలో తండాలు ఉండడంతో వాహనాల రద్దీ పెద్దమొత్తంలో ఉంటుంది. ఇన్ని గ్రామాలు ఉన్నా జాతీహరహదారి ముఖ్య కూడలిలో రోడ్డు రెండు లేన్లుగా మాత్రమే ఉంది. రోడ్డు నిర్మాణంలో అధికారుల లోపం, నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది వాహనదారులు, ప్రజలు మృత్యువాతతోపాటు ఎంతో మంది అంగవైకల్యం పాలవుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో?

జడ్చర్ల వైపు నుంచి బాలానగర్ వచ్చే వాహనాలకు ఎటువంటి అడ్డంకి లేకపోవడంతో వాహనాలు వేగంతో వస్తుండడంతో ముఖ్యకూడలిలో రోడ్డు దాటే వాహనాలను ఢీకొంటూ ప్రమాదాలు అధికంగా అవుతున్నాయి. అటువైపుగా వచ్చే వాహనాల వేగాన్ని నియంత్రించడానికి బారికేడ్లు ఏర్పాటు చేసినా ఫలితం పెద్దగా లేదు. సబ్‌రోడ్లు, రోడ్డు విస్తరణతోపాటు, బ్రిడ్జి నిర్మాణం చేస్తేనే ప్రమాదాలు కాకుండా శాశ్వత పరిష్కారం లభించనుందని మండల ప్రజలు చెబుతున్నారు.

ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలి..



ప్రధాన కూడలిలో రెండు లేన్లుగా ఉన్న రోడ్డును నాలుగు లేన్లుగా మార్చడంతోపాటు అంతర్గత రోడ్డు లేదా బ్రిడ్జి నిర్మాణం చేస్తేనే ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– బాబు నాయక్, నేరళ్లపల్లి

నివారణకు చర్యలు..



జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారణకు ఇప్పటికే బారికేడ్లు ఏర్పాటు చేశాం. వాహనదారులకు తరుచూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే రోడ్డు 6 లేన్లుగా మారనుంది. ఆ సమయంలో అంతర్గత వంతెన లేదా బ్రిడ్జి నిర్మాణంతోపాటు సబ్ రోడ్డు సైతం ఏర్పాటు కానుంది.

– శ్రీనివాస్, ఎస్‌ఐ, బాలానగర్

బీఆర్‌ఎస్ పాలనలోనే తండాల అభివృద్ధి

జడ్చర్ల: దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గిరిజన తండాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి చేసిందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని నసరుల్లాబాద్‌తండాలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఎన్నికల సమయం ఆసన్నమైందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భవిష్యత్ బాగుండాలంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాల్సిందేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, ప్రణీల్ చందర్, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ మార్కెట్ చైర్మన్

దేవరకద్ర: మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రోళ్ల సత్యనారాయణ తన అనుచరవర్గంతో గురువారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అన్నాసాగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పెద్దరాజమూర్ చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు తరుణ్, రవి, మహ్మద్, వెంకటయ్య, ఆంజనేయులుతో పాటు మరో 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

గండేడ్: ఓటరు లిస్టులో 18ఏళ్లు నిండిన వారు పేర్లను నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నాగలక్ష్మి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలు, మహిళా సంఘాల సభ్యుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాల్లో మహిళా సంఘాలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని భక్త మార్కండేయ ఆలయాభివృద్ధికి రిటైర్డ్ ఉద్యోగి నామాల సుభాస్‌చంద్రబోస్ రూ.1,11,111లను విరాళంగా అందజేశారు. ఆలయం వద్ద గురువారం మార్కండేయ జయంతి సందర్భంగా ఆలయ నిర్వాహకులకు నగదును అందజేయగా వారు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మశ్చందర్‌నాథ్, శెట్టిశేఖర్, హోటల్ బాబు, గడ్డం మహేందర్, శ్రీను, తిరుపతి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

చిన్నచింతకుంట: మండలంలోని పర్దిపురం చెందిన బీరప్ప చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి వచ్చిన రూ 2లక్షల ఎల్‌ఓసీని గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కోటరాము నాయకులు పాల్గొన్నారు.

పేదలకు టార్పాలిన్ల పంపిణీ

పాలమూరు: వర్షాకాలం నేపథ్యంలో వివిధ గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలో నివసిస్తున్న బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో టార్పాలిన్లను గురువారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తి సంధ్యారాణి, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఆరాధనోత్సవాలు గురువారం కొనసాగాయి. సుప్రభాతం, అష్టోత్తర పారాయణం, పాదపూజ, కనకాభిషేకం, పంచామృతాభిషేకం, వస్త్ర సహిత పుష్పాలంకరణ, తులసి అర్చనలు చేశారు. అదేవిధంగా రథోత్సవం నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం, విష్ణునామ పారాయణం చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఆదిఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేసినట్లు అర్చకుడు రాఘవేందర్‌రావు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

